క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో చిలకలమర్రి విద్యార్థుల ప్రతిభ


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

చేజర్ల (సోమశిల): జిల్లా స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీల్లో అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. బుధవారం నెల్లూరు దర్గామిట్ట బాలుర ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థిని హారిక, 9వ తరగతి విద్యార్థి జ్ఞానేష్ ఓ జట్టుగా ఈ పోటీల్లో విజయం సాధించారని పాఠశాల హెచ్ఎం సురేష్ తెలిపారు. వీరికి జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరికి గైడ్ టీచర్లుగా మహేష్, మాధవి వ్యవహరించారు.

సమస్యలపై దృష్టి పెట్టండి


మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎంపీపీ శశిరేఖ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో తాగునీరు, కరెంట్ వంటి సమస్యలు ఉన్నాయని ఎవరైనా ఫోన్ చేసినా, లేక అధికారుల దృష్టికి వచ్చినా సకాలంలో స్పందించి ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి 21 లేఅవుట్లు నుడా పరిధిలోకి వచ్చాయని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన లేఅవుట్‌లో ఇళ్లను పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సురేంద్ర, పలు శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సర్పంచ్‌ల సంఘం సన్మానం


సీఐని సన్మానిస్తున్న కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి

ఉదయగిరి: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి నుంచి మంగళవారం ప్రశంసాపత్రం అందుకున్న ఉదయగిరి సీఐ గిరిబాబును బుధవారం సర్కిల్ కార్యాలయంలో సర్పంచ్‌ల సంఘం నాయకుడు కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రశంసా పత్రాలు, అవార్డులు ఎన్నో అందుకోవాలని ఆయన కోరారు.

కొండాపురంలో సంబరాలు

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా మేకపాటి రాజారెడ్డిని ప్రకటించడంతో కొండాపురంలో మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి స్థానికంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. 2024లో రాజారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొనే విధంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిమ్మలి రామ్మూర్తి, వీరేళ్ల మాధవ, మాలకొండమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదూరుపల్లి ఫారెస్ట్ ఠానా తనిఖీ

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి ఫారెస్ట్ ఠానాను బుధవారం రాత్రి ఆకస్మికంగా జిల్లా అటవీ శాఖాధికారి ఏ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. అడవుల సంరక్షణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వన సంరక్షణ సమితి ద్వారా నానా జాతి మొక్కలతో పాటు, జామాయిల్ మొక్కలను పెంచారు. 7 ఏళ్ల దాటిన జామాయిల్ మొక్కలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కటింగ్ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్ రేటు ప్రకారం జామాయిల్ మొక్కలను కటింగ్ చేసే దానిపై రాపూరు రేంజ్ అటవీ సిబ్బందికి ఆదూరుపల్లి ఠానాలో అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అనుమతి వచ్చిందని తెలిపారు.

డీఆర్‌డీఏ క్రెడిట్ క్యాంప్

సంగం: సంగం పొదుపు కార్యాలయంలో డీఆర్‌డీఏ బ్యాంకు లింకేజీ డీపీఎం చంద్రశేఖర్ బుధవారం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. పొదుపు సభ్యులకు వ్యక్తిగత రుణాలు మంజూరుపై అవగాహన కల్పించారు. కెనరా బ్యాంకు మేనేజర్ సందీప్‌రెడ్డి, ఏపీజీబీ మేనేజర్ బాలకృష్ణ వ్యక్తిగత రుణాల మంజూరుకు సంబంధించి అర్హత, అనర్హతలను పొదుపు సభ్యులకు వివరించారు. డీపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ పొదుపు సభ్యులు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యక్తిగత రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. పొదుపు సభ్యురాలు వ్యాపార పరంగా, కుటుంబ పరంగా అభివృద్ధి చేసుకుంటామని ముందుకు వస్తే వ్యక్తిగతంగా యూనిట్లు స్థాపించేదుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కేడర్ జోష్

- ఉదయగిరి సమన్వయకర్తగా రాజగోపాల్‌రెడ్డి
- బ్రాహ్మణపల్లిలో ఆయన్ను కలిసిన నేతలు
- ఉదయగిరి నేతలతో రాజమోహన్‌రెడ్డి సమావేశం


ఉదయగిరి నేతలతో మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి (రాజారెడ్డి)ని ఆ పార్టీ అధిష్టానం నియమించడంతో కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఇప్పటి వరకు తెర వెనుకుండి రాజకీయాలు చేసిన రాజారెడ్డి అనూహ్యంగా ప్రత్యక్ష రాజకీయ రంగ ప్రవేశం చేశారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ అవకాశం ఇవ్వడంతో ఆయన ఎమ్మెల్యే అయ్యారు. అయితే ఆయన పార్టీకి ద్రోహం చేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి మద్దతుగా నిలిచారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో సమన్వయకర్త విషయంలో అనేక తర్జన భర్జనలు జరిగాయి. చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె ఆదాల రచనారెడ్డిని నియమించాలని మేకపాటి రాజమోహన్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చెప్పారు. రచనారెడ్డి కుటుంబ సభ్యులు ఆసక్తి చూపలేదు. దీంతో ఆ ప్రతిపాదనకు తెరపడింది. ఇదే సమయంలో పలువురు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

వారికి పట్టు ఉండడంతో..

1983వ సంవత్సరం నుంచి మేకపాటి కుటుంబానికి ఉదయగిరిపై పట్టు ఉంది. రాజమోహన్‌రెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. చంద్రశేఖర్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఈ నేపథ్యంలో రాజమోహన్‌రెడ్డి తన చిన్న సోదరుడు రాజారెడ్డిని ఉదయగిరి నుంచి బరిలో దించే ఆలోచనతో సీఎం జగన్‌ను కలిసి విషయం చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి వీర విధేయుడిగా ఉంటూ, కష్టకాలంలో తమతో నడిచిన రాజమోహన్‌రెడ్డి సూచన మేరకు సమన్వయకర్తగా రాజారెడ్డి పేరును జగన్ ఖరారు చేశారు.


రాజారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బ్రాహ్మణపల్లిలో సందడి

మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి స్వగృహంలో బుధవారం రాజారెడ్డిని కలిసేందుకు ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజారెడ్డి తనను కలిసిన వారిని పరిచయం చేసుకుంటూ పార్టీ పరిస్థితి గురించి ఆరా తీశారు. అలాగే మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన సోదరుడిని పరిచయం చేసి పలు సూచనలిచ్చారు. అందరూ కష్టపడి పనిచేసి పార్టీని గెలిపించుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ


సభ్యులకు పలు విషయాలు వివరిస్తున్న కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ కౌన్సిల్ తీర్మానించింది. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. మొత్తం 22 అంశాలతో పొందుపరిచిన అజెండాను ఏఈ ప్రసాద్, అసిస్టెంట్ రమేష్ చదివి వినిపించారు. 2వ వార్డు పరిధిలో డంపింగ్ యార్డు వద్ద షెడ్డు నిర్మాణం, బోరువెల్ పనుల కోసం ఇప్పటికే టెండర్లు వేసి ఉండగా వాటిలో తక్కువ ధరకు కొటేషన్ దాఖలు చేసిన వారికి పని అప్పగించేలా తీర్మానం ఆమోదించారు. పలు వార్డుల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మాణం, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మిగిలి ఉన్న పనులను పూర్తి చేయడం, చేతి పంపులు మరమ్మతులకు నిధుల కేటాయింపు, పాత బోర్ మోటార్ల స్థానంలో నూతన మోటార్ పంపుసెట్ ఏర్పాటు తదితర పనులతో పాటు మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని పూల దుకాణం మూడేళ్ల పాటుకు లీజు వేలం పాట, తదితర పనులకు సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అంతకు ముందు కొన్ని పనులను ఆమోదించే క్రమంలో మూడో వార్డు టీడీపీ కౌన్సిలర్ గౌస్‌బాషా, 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి అభ్యంతరం తెలపడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, పి తిరుపతమ్మ దీటైన సమాధానం ఇచ్చారు. తిరుపతమ్మ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సొంత నిధులతో అధునాత బస్టాండ్ నిర్మించారని ఆత్మకూరుకు ఐకాన్‌లా ఉన్న ఈ నిర్మాణం అభివృద్ధికి నిదర్శనం కాదా ప్రశ్నించారు. బస్టాండ్ ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయడం అభివృద్ధి కాదాని నిలదీశారు. అదే క్రమంలో మున్సిపల్ పరిధిలో చెత్త తొలగింపు, నిత్యం కార్మికులు చేస్తుండడం విమర్శించే వారికి కనిపించడం లేదా అన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ అంతర్గత సిమెంట్ రోడ్లు సచివాలయం నిధులతో, మున్సిపల్ నిధులతో ముమ్మరంగా వార్డుల్లో జరుగుతున్నాయని, హిందూ శ్మశాన వాటికకు రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ మాట్లాడుతూ కార్మికులకు గ్లౌజులు, దుస్తులు, ఆయిల్ తదితర ఉపకరణాలతో పాటు చెత్త సేకరించేందుకు ప్లాస్టిక్ బుట్టలను త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో అందరం కలిసికట్టుగా ఆత్మకూరు మున్సిపల్ అభివృద్ధికి కృషి చేద్దామని కౌన్సిలర్లు సహకరించాలని ఆమె కోరారు. వైస్ చైర్మన్ షేక్ సర్దార్ మాట్లాడుతూ ఇప్పటికే పలు వార్డుల్లో సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, పనులు సాగుతున్నాయన్నారు. అక్రమ లేఅవుట్లను మున్సి పల్ అధికారులు పరిశీలించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి నాగేశ్వరరావు, ఆర్ఐ ఖాసీం, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రతి కుటుంబానికి రక్ష


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ప్రతి కుటుంబంలోనూ అవసరమైన అన్ని ధ్రువపత్రాలు ప్రభుత్వ యంత్రాంగం తమ ఇంటి వద్దకే వచ్చి లబ్ధిదారులకు అందజేసే జగనన్న సురక్ష పథకం ప్రజల పాలిట రక్ష అని మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు, అవినీతి రహితంగా లబ్ధిదారులకు అందజేస్తుండడం, చరిత్రలో నిలిచిపోయే పరిణామమన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జగన్ అడుగుజాడల్లో నడుస్తూ గడప గడపకు తిరిగి ప్రజలకు దగ్గరయ్యారని తెలిపారు. ఏపిలగుంట ఎంపీటీసీ సభ్యుడు నాయుడు హజరత్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు ఇటీవల మర్రిపాడు మండలంలో నిర్వహించిన పాదయాత్రకు హాజరైన జనం కంటే ఆత్మకూరులో మేకపాటి గౌతమ్‌రెడ్డి బస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజలు అనేక రెట్లు అధికంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, ముటుకుందు జయరామిరెడ్డి, చంద్రా నారాయణ స్వామి, పొంగూరు సుధాకర్, ఓంకారం శివకుమార్, ఇందూరు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

జగనన్న సురక్ష బాధ్యతగా నిర్వహించండి

ఆత్మకూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి కచ్చితంగా చేరేలా పర్యవేక్షించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 17, 19, 20 వార్డుల సచివాలయంలో బుధవారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొండా స్వరూపరాణి, వార్డు ఇన్‌చార్జి కొండా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా జగనన్న సురక్ష నిర్వహించండి


చిత్తలూరులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

చేజర్ల: జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి చెప్పారు. బుధవారం చేజర్ల మండలం చిత్తలూరులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పేదల సమస్యలు నమోదు చేయడంతో పాటు సంబంధిత శాఖల అధికారులు దృష్టికి తీసుకెళ్లతారన్నారు. ఎంపీడీఓ ఎస్.కరిముల్లా, తహసీల్దార్ శివకృష్ణయ్య, ఈఓపీఆర్డీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో

అనంతసాగరం మండలంలోని ఉప్పలపాడు, మంచాలపల్లి గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ మదుసూదనరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్ పాల్గొన్నారు.

పొదుపు రుణాలు రికవరీ చేయండి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

చేజర్ల: స్త్రీనిధి, ఉన్నతి పొదుపు గ్రూపుల రికవరీలు త్వరితగతిన చేయించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. బుధవారం చేజర్లలో వైఎస్సార్ కేపీ (వైఎస్సార్ క్రాంతి పథం) కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూలకు ఇచ్చిన స్త్రీనిధి, ఉన్నతి రుణాలు త్వరగా రికవరీ చేయించాలని కోరారు. మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు బ్యాంక్‌ల ద్వారా పరిశ్రమలు పెట్టుకునేందుకు వ్యక్తిగతంగా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. 54 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి వారికి సూచనలు, సలహాలు తెలిపారు. మండలంలో దాదాపు 774 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో చేజర్ల, ఆదూరుపల్లి గ్రామీణ బ్యాంక్‌ల మేనేజర్లు, ఏసీ వెంకటేశ్వరరావు, ఏపీఎం చీర్ల సుజన, సంఘమిత్ర ఈసీ సభ్యులు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): విద్యార్థి దశలో టీవీ, సెల్‌ఫోన్ల వినియోగానికి చిన్నారులు దూరంగా ఉండాలని, లేకుంటే కంటి చూపు మందగించే అవకాశం ఉందని మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్య నిపుణుడు కోటేశ్వరరావు అన్నారు. మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వంద మందికిపైగా విద్యార్థులకు ఆయన కంటి పరీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి గురైన చిన్నారులకు తలనొప్పి రావడం, పౌష్టికాహారలోపం వల్ల కంటి చూపు తగ్గుతాయన్నాయన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మలత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించండి

- టోల్‌ఫ్రీ నంబరు ఆవిష్కరించిన ఆర్డీఓ


వయోవృద్ధుల సంరక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబరు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

ఆత్మకూరు: వృద్ధులను ఇబ్బందులు పెట్టే వారిపై కఠినంగా శిక్షించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని, ప్రతి ఒక్కరు తమ ఇళ్లలోని వృద్ధులను ఆదరణతో చూడాలని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి చెప్పారు. ఆర్డీఓ కార్యాలయంలో నెల్లూరుకు చెందిన హెల్ప్ ఏజ్ ఇండియా ఆర్గనైజేషన్ వయోవృద్ధుల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ నంబరు 14567ను ఆర్డీఓ కరుణకుమారి బుధవారం ఆవిష్కరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వృద్ధులను, తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదేనన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పి జాన్‌బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ట్యాంకర్, కారు ఢీ

ఆత్మకూరు: కృష్ణపట్నం నుంచి కర్ణాటకు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ను బద్వేల్ నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు నెల్లూరుపాళెం వద్ద ముంబయి జాతీయ రహదారిపై వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. జాతీయ రహదారుల సంస్థ అంబులెన్స్‌లో గాయపడిన ఇద్దరిని నెల్లూరుకు ఆస్పత్రికి తరలించారు.


జగనన్న సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

సంక్షేమ పథకాల సారథి జగనన్న

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: సంక్షేమ పథకాల సారథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని గాంధీ కాలనీ, వడ్డిపాళెం తదితర కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. జగనన్నకు ప్రజల మద్దతుందన్నారు. తమపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల రూపంలో రాక్షస పాలన చేశారన్నారు. రేషన్‌కార్డు, పింఛన్, ఇతర పనుల కావాలన్న జన్మభూమి కమిటీలు ఆమోదిస్తేనే జరిగేవన్నారు. ప్రతి పథకం టీడీపీ వర్గానికే దక్కేదన్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కుల, మత పార్టీలకతీతంగా అర్హులకు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలు వంద శాతం సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ఇంటింటికి వెళ్లిన సమయంలో వచ్చే సమస్యలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు దండా కృష్ణా రెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఉస్మాన్ షరీఫ్, సాధిక్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నిమ్మల భాస్కర్, మనోహర్, పోలయ్య, మల్లి, సుధ, రసూల్, జంషీర్, వీరయ్య, శ్రీహరి, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఎంపీడీఓ సహా పలువురు సిబ్బందిపై చర్యలకు ఆదేశం
- సబ్ కలెక్టర్ శోభిక


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శోభిక

వరికుంటపాడు: మండలంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక హెచ్చరించారు. ఆమె బుధవారం వరికుంటపాడు మండలంలోని తోటలచెరువుపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని, పంచాయతీ కార్యదర్శి, వెటర్నరీ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని, ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. అనంతరం వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో సిబ్బందికి, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లను కార్యదర్శులు అందుబాటులో ఉంచుకొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు గుర్తించాలన్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో ఏ పథకం అందలేదో తెలుసుకుని వారి వివరాలు నమోదు చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మండలం పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. ప్రతి రోజూ నివేదికలను తనకు అందజేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖశక్తి గణపతికి రాజారెడ్డి ప్రత్యేక పూజలు


పంచముఖ శక్తి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో కొలువై ఉన్న శ్రీపంచముఖ శక్తిగణపతికి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి (రాజారెడ్డి) బుధవారం తెల్లవారుజామున విశేష పూజలు, అర్చనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన నేపథ్యంలో తొలి పూజలు అందుకునే పంచముఖ శక్తి గణపతి స్వామి ఆలయంలో పూజలు నిర్వహించామన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో దఫా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ పూజారి పాశర్ల పూడి వెంకటేశ్వర్లు శర్మ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి


ఎమ్మెల్యే రామిరెడ్డి, పక్కన ఆర్డీఓ శీనానాయక్

కావలి: పట్టణంలోని పేదలకు జగనన్న లే అవుట్‌లో నిర్మితమవుతున్న పక్కాగృహాలు నిర్మాణంలో జ్యాప్యానికి అవకాశం లేకుండా త్వరతగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యలయంలో బుధవారం జగనన్న కాలనీలో నిర్మాణాలపై అధికారుతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ, మున్సిపల్ అధికారులు, హౌసింగ్ అధికారులతో పాటు జగనన్న ఇళ్ల నిర్మాణాల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. తొలుత కాంట్రాక్టర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించి పరిష్కరించాల్సిందిగా సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముసునూరులోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలతో పాటు, అప్రోచ్ రోడ్లు, ప్రవేశ మార్గం వద్ద ఆర్చి నిర్మాణాలపై కూడా దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ మెగా లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు శరవేగంగా పూర్తి కావడానికి కలెక్టర్ కూడా సహకరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సిగ్గు చేటు


మాట్లాడుతున్న గంధం ప్రసన్నాంజనేయులు

కావలి: టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం కుమ్ములాడుకుంటూ ఒకరిపై మరొకరు దాడులు, ఘర్షణలకు పాల్పడుతూ.. వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సిగ్గు చేటని కావలి పట్టణ వైఎస్సార్‌సీపీ నేత గంధం ప్రసన్నాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని వెంగాయగారి పాళెంలో మద్యం విషయంలో తెలుగుదేం కార్యకర్తలు ఘర్షణ పడ్డారన్నారు. కొట్టుకున్న వాళ్లందరూ టీడీపీ వర్గీయులైతే.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారంటూ టీడీపీ కావలి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆరోపించడం ఇంత కన్నా దిగజారుడు రాజకీయాలు ఉండవన్నారు. కొట్టుకున్న వాళ్లు ఎవరో ఇక్కడి జనాలకు తెలుసు.. కానీ జిల్లాలో పార్టీపై బురద జల్లేందుకు నీచ రాజకీయాలు చేయడం దుర్మాగం అన్నారు. తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న టీడీపీకి చెందిన కాంట్రాక్టర్‌తో పనులు చేయనికుండా కుట్రపూరితంగా అడ్డుకున్నది టీడీపీ నాయకులే అని విమర్శించారు. తుమ్మలపెంట రోడ్డు దుస్థితికి కారణమై టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు గుడ్లూరు మాల్యాద్రి ఏగూరు చిన్న పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక రీచ్ వద్ద రైతుల ఆందోళన

సంగం: సంగం ఇసుక రీచ్ వెళ్లే రహదారిలో బీరాపేరు వంతెన వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఇసుక వాహనాలు రీచ్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. భారీ ఇసుక వాహనాలతో వంతెనతో పాటు పొలాలకు వెళ్లే రహదారులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్నాపొర్లు కట్టలను సైతం తవ్వేస్తుండడంతో తమ పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. అధికారులు రీచ్ నిర్వాహకులను ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు.